మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఉద్యోగ భద్రత కరువు

- అందని ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు - విద్యుత్ శాఖలో ఎస్‌పిఎం కార్మికుల అవస్థలు

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేసే ఎస్‌పిఎం కార్మికుల జీవితాలు భద్రత లేని ఉద్యోగాలతో సాగుతున్నాయి. కార్మికులకు అందాల్సిన ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు అందడం లేదు. వారికి బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదు. దీంతో వివిధ సందర్భాల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు..

విద్యుత్ శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 12 ఎస్‌పిఎం (స్పెషల్ (ప్రొటెక్టింగ్ మెయింటెనెన్స్) షెడ్లు (వర్క్‌షాప్‌లు) ఉన్నాయి. వాటిలో ఒక్కో షెడ్‌కు 13 మంది చొప్పున 156 మంది కార్మికులు పని చేయాలి. కానీ అరకొరగా కార్మికులను పెట్టుకుని పనులు చేయించుకుంటున్నారు. 12 షెడ్లలో కలిపి మొత్తం 65 మంది మాత్రమే పని చేస్తున్నారు. కర్నూలు పట్టణంలోని షెడ్డులో ఆరుగురు, డోన్‌లో ఏడుగురు, కర్నూలు రూరల్ షెడ్‌లో ఆరుగురు, ఆదోనిలో ఏడుగురు, పత్తికొండలో ఐదుగురు, నందికొట్కూరులో ఆరుగురు, బనగానపల్లెలో ఆరుగురు, నంద్యాల పట్టణంలో ముగ్గురు, నంద్యాల రూరల్ షెడ్‌లో ఆరుగురు, ఆళ్లగడ్డలో ఆరుగురు, కోవెలకుంట్లలో ఆరుగురు, ఎమ్మిగనూరులో ఆరుగురు కార్మికులు పని చేస్తున్నారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, వైండింగ్ పనులు, కాయిల్ మరమ్మతులు, ఆయిల్ మార్పిడి వంటి పనులు ఎస్‌పిఎం కార్మికులు చేస్తున్నారు. 8 రకాల త్రీ ఫేస్, 3 రకాల సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేస్తారు. అత్యవసర పని చేసే వారంతా హైస్కిల్ల్ కార్మికులే. హైస్కిల్ కార్మికులకు కాంట్రాక్టు కార్మిక చట్టం ప్రకారం నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి. ఎస్‌పిఎం కార్మికులందరూ వివిధ కాంట్రాక్టర్ల కింద పని చేస్తున్నారు. ఏ ఒక్క కాంట్రాక్టరు కూడా కనీస వేతనాన్ని చెల్లించడం లేదు. రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే నెలవారీ వేతనం చెల్లిస్తున్నారు. అందులో కూడా పనికి రాని రోజుల్లో వేతనాన్ని కోత విధిస్తున్నారు. కార్మికులు కల్పించాల్సిన ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను కూడా కల్పించడం లేదు. బీమా సౌకర్యం లేదు. ఉద్యోగ భద్రత కూడా కరువైంది. రెండు సంవత్సరాల క్రితం వేతనం పెంచగా అప్పటి నుంచి మళ్లీ పెంచలేదు. రోజు రోజుకూ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక పక్క కుటుంబ భారాలు, మరో పక్క పిల్లల చదువులు, స్కూల్ ఫీజులు, వయోవృద్ధులైన తల్లిదండ్రుల వైద్య ఖర్చులతో చాలీచాలని జీవితాలతో కార్మికులు బతుకీడుస్తున్నారు. అప్పులు చేసి వడ్డీ కట్టలేక సతమతమౌతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలు సార్లు ఆందోళనలు చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖలో ఎస్‌పిఎం కార్మికులు కోరుతున్నారు.



పనికి తగిన వేతనం ఇవ్వాలి

30 ఏళ్లగా పని చేస్తున్నాను. ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేదు. కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా పనికి తగిన వేతనం చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇఎస్ఐ, పిఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలి.

- జె.శ్రీనివాసులు, ఎస్‌పిఎం కార్మికుడు, కర్నూలు.

త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్

- ప్రభుత్వ 100 రోజుల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారు : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ రానుందని, నూతన ప్రభుత్వ 100 రోజుల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంలోని 47వ వార్డు ధర్మపేట నవీబాయరం వద్ద, 13వ వార్డు బంగారు పేట శ్రీరామ టాకీస్ సమీపంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పాల్గొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మంత్రి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజనరీతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశలో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. మాట ఇచ్చిన విధంగా పెన్షన్ రూ.4 వేలు చేశామని, డిఎస్‌సి విడుదల చేశామన్నారు. పేదల ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించి నట్లు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించామన్నారు. విజయవాడలో వరదలు వస్తే రాత్రింబవళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కష్టపడ్డారన్నారు. 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలందరూ చెప్పేలా తమ పాలన ఉందన్నారు. కర్నూలు నగరంలోని సమస్యలను పరిష్కరించి నగర రూపురేఖలు మారుస్తానని చెప్పారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తెస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమానికి సంబంధించిన వార్డు సభ ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయిన 100 రోజుల్లో చేసిన పనులను గురించి వాల్ పోస్టర్ విడుదల చేశామన్నారు. ఇందులో ఆరు అంశాలు మెగా డిఎస్‌సి, పింఛన్లు, ఉద్యోగులందరికీ ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం గురించి, పేదలందరికీ ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, వరదల సమయంలో ప్రభుత్వం చేపట్టిన విషయాలను గురించి తదితర అంశాలు తెలియజేసే వాల్ పోస్టర్లను విడుదల చేశామన్నారు. ఈ రెండు నెలల్లో మన జిల్లాలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో రెండో స్థానంలో ఉన్నదని, అన్న క్యాంటీన్ల విషయానికొస్తే మన నగరంలో ఇప్పటికే రెండు క్యాంటీన్లను ప్రారంభించుకున్నామని, సోమవారం కూడా అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నాగేశ్వర్‌రావు యాదవ్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, స్థానిక నాయకులు, ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డు కార్పొరేటర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాలకు మార్గదర్శి ఏచూరి

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-పత్తికొండ: దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలిగిస్తూ సమయం వచ్చినప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణకు బిజెపి విధానాలను కూడా విభేదించే వ్యక్తి ఏచూరి మార్గదర్శిగా పని చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య అన్నారు. ఆదివారం పత్తికొండ సాయిబాబా టెంపుల్ ప్రాంగణంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. గౌస్ దేశాయ్, పి.రామచంద్రయ్య, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమ లింగప్ప, టిడిపి నాయకులు అశోక్ కుమార్, ముత్యాల తిరుపాల్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల కోసం ఏచూరి నిత్యం పరితపించే వారని కొనియాడారు. విద్యార్థి దశ నుండి ఉద్యమాల బాటలో నడిచి దేశ రాజకీయాలలో కీలక పాత్ర పోషించారని అన్నారు. పార్లమెంటు రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగాన్ని తప్పుబట్టి సవరించిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. భవిష్యత్తులో ఏచూరి ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్లి ఆయన అడుగుజాడల్లో నడవడమే తమ వంతు కృషి చేస్తామని వారు నివాళులర్పించారు. సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు వీరశేఖర్, నబీ రసూల్, లోకేశ్వర నాయకుడు ఆనందాచారి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకురాలు అరుణమ్మ, సిపిఎం మండల నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దయ్య, సురేంద్ర, దస్తగిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ఆన్‌లైన్‌తో మరింత అందుబాటులోకి ఇసుక

- అక్రమ రవాణాను అరికట్టేందుకు కొత్త పాలసీ
- ఇంటి వద్దకే ఇసుక తరలించేలా చర్యలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో బుకింగ్స్
- ప్రజాశక్తితో గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో ఇసుకను ప్రజలకు అందరికీ మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకే నూతన పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అందులో భాగంగానే ఆన్‌లైన్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టిందని కర్నూలు ఉమ్మడి జిల్లా గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ అన్నారు. కేవలం రవాణా ఛార్జీలను మాత్రమే స్వీకరించి ప్రజలకు ఇసుకను ఉచితంగా అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నూతన పాలసీ విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. జిల్లాలో ఇకపై ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మరింత పటిష్ట చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

ఉచిత ఇసుక అంటున్నారు? మరోవైపు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు? దీని పట్ల మీరేమంటారు?

డిడి : ప్రభుత్వం ఉచిత ఇసుకను అమలు చేస్తున్న విషయం అక్షర సత్యం. ఇసుక కోసం ప్రభుత్వం ఎలాంటి ఫీజులు తీసుకోవడం లేదు. కేవలం ఇసుక రవాణా, సీవరేజ్ ఛార్జీలను మాత్రమే మాత్రమే వసూలు చేస్తోంది. అవన్నీ కలిపి టన్నుకు రూ.320 గా నిర్ణయించింది. అది మాత్రమే ఇసుక కొనుగోలుదారుడు చెల్లించాలి. ఇసుక కోసం రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

ఉచిత ఇసుక ఎలా పొందాలి?

డిడి : ఉచిత ఇసుక పొందడానికి గనులు మరియు భూగర్భ శాఖ ప్రత్యేకంగా ఏపీ శాండ్ పోర్టల్ (http://www.sand.ap. gov.in)లో ముందుగా లాగిన్ అవ్వాలి. తర్వాత అందులో మీ ప్రాజెక్టు లేదా నిర్మాణ సైట్ లోకేషన్ వివరాలు, జిపిఎస్ కోఆర్డినేట్స్‌ని పొందుపరచాలి. పొందు పరిచిన వివరాల ప్రకారం అవసరమైనంత ఇసుకను దగ్గర్లోని ఏ ఇసుక సరఫరా కేంద్రం నుంచి అయినా పొందేలా అనుమతులు ఇస్తాం. ఇదే కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో లేదా కర్నూలు రెవిన్యూ డివిజన్ మండల తహశీల్దార్ కార్యాల యాల్లోనూ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పించాం.

ఇసుక రవాణా కోసం చెల్లించాల్సిన ఛార్జీలు ఏ విధంగా ఉన్నాయి?

డిడి : ఇసుక ఎన్ని టన్నులు ఎంత దూరం రవాణా చేయాల్సి ఉంది అన్న విషయాలని ఆధారంగా చేసుకొని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన ఛార్జీల విధానాన్ని ప్రవేశపెట్టింది. టన్నుకు రూ.320 చొప్పున చెల్లించాలి. రవాణా ఛార్జీలు అదనంగా చెల్లించాలి. 20 కిలోమీటర్ల వరకు 4.5 టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్‌కు రూ.1400, 10 టన్నుల ఇసుక పట్టే ఆరు టైర్లు ఉన్న లారీకి రూ.2 వేలు, 18 టన్నుల ఇసుక పట్టే 10 టైర్లు ఉన్న లారీకి రూ.3,600, 22 టన్నులు ఇసుక పట్టే 12 టైర్లు ఉన్న లారీకి రూ.3,840, 31 టన్నుల ఇసుక పట్టే 16 టైర్లు ఉన్న లారీకి రూ.4,480 చెల్లించాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్లు దాటికే ఒక టన్నుకు రూ.8, 18 టైర్ల లారీకి మాత్రం టన్నుకు రూ.7 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఎన్ని రోజుల్లో ఇసుక కొనుగోలుదారునికి సరఫరా చేస్తారు? నేరుగా ఇంటి దగ్గరికి ఇసుక పంపే అవకాశం ఏమైనా ఉందా?

డిడి : ఆన్‌లైన్ ఇసుక కోసం ఆర్డర్ బుక్ చేసుకున్న ఒకటి లేదా రెండు పని దినాల్లో బుక్ చేసిన ప్రాంతానికి రవాణా చేస్తారు. ఇంటి వద్దకే బుక్ చేసుకుంటే ఇసుక సరఫరా కేంద్రం నుండి ఇంటి మధ్య దూరానికి సంబంధించిన రవాణా ఛార్జీలను చెల్లిస్తే ఇంటి వద్దకు నేరుగా రవాణా చేస్తారు.

ఇసుక రవాణా చేసుకోవడానికి సొంత వాహనాన్ని ఉపయోగించవచ్చా?

డిడి : కొనుగోలుదారుడు ఆర్డర్ చేసిన ఇసుకను సొంత వాహనంలో ఇసుకను తరలించుకోవచ్చు. అయితే ఆ వాహనం తప్పనిసరిగా ఆంధ్ర ప్రభుత్వం గనులు మరియు భూగర్భ శాఖ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని ఉండాలి.

ఇసుకను ఏ రోజైనా ఆర్డర్ చేసుకోవచ్చా?

డిడి : ఇసుకను ప్రభుత్వ పని దినాలలో మాత్రమే ఆర్డర్ చేసుకోవాలి. అది కూడా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే ఇసుక పోర్టల్‌లో ఆర్డర్ చేయడానికి అనుమతి ఉంటుంది. తక్కిన సమయంలో అవకాశం ఉండదు.

కర్నూలు జిల్లాలో ఎన్ని రీచ్‌లు అందుబాటులో ఉన్నాయి?

డిడి : కర్నూలు ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఐదు ఇసుక డీసిల్టింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. సి.బెలగల్ మండలం పరిధిలో కొత్తకోట, సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్లెదొడ్డిలో ఆ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని రీచ్‌ల అనుమతుల కోసం ప్రస్తుతం ప్రయత్నం కొనసాగుతోంది.

జిల్లాలో రోజుకు ఎంత ఇసుక డిమాండ్ ఉంటుంది?

డిడి : జిల్లాలో రోజుకు ఐదు వేల టన్నుల ఇసుక వినియోగ అవసరాలు ఉన్నట్లు గుర్తించాం. అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఇసుక డీసిల్టేషన్ కార్యక్రమం ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజు మూడు నుంచి నాలుగు వేల టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నాం.

ఏ సమయాల్లో ఇసుక డెలివరీ కేటాయింపులు జరుగుతాయి?

డిడి : ఉదయం 6 గంటల నుండి కేటాయింపులు మొదలవుతాయి. ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నగరాల్లో మాత్రం రాత్రి 10 గంటల తర్వాత కేటాయింపులు జరుగుతాయి. ప్రభుత్వ సెలవు దినాలలో కేటాయింపులు జరగవు.

పశుసంవర్ధక శాఖ సహాయకుల నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా పశుసంవర్ధక సహాయకుల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎపిఎన్‌జిఒ హోమ్, కర్నూలులోఆదివారం ఎన్నుకున్నారు. పశు సంవర్ధక సహాయకుల రాష్ట్రఅధ్యక్షులు పివి.రాజేష్ బాబు, ప్రధాన కార్యదర్శి డి.విజయ్ నాయక్ ,కోశాధికారి టి.మంజునాథన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పివి.రాజేష్‌బాబు మాట్లాడుతూ పశు సంవర్ధక సహాయకులు ఇటు పశు సంవర్ధక శాఖకు సంబంధించిన పనులు , ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేస్తూ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని కనుక రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఉత్తర్వుల మేరకు ఎహెచ్‌ఎ లకు ఇతర శాఖలకు సంబంధించిన పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో ఎహెచ్‌ఎ జిల్లా అధ్యక్షురాలిగా పి.నాగవాసవి, కార్యదర్శిగా ఎ.సురేష్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి వెంకటేష్, కోశాధికారిగా ఎం.భూపతి, ఉపాధ్యక్షులుగా జి.సురేష్ బాబు, ఎన్. సుశీల, పి సంపత్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శరత్, సంయుక్త కార్యదర్శిగా బి.శ్రావణి, పి శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా జి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ గా పి.సుధాకర్ వ్యవహరించారు.

అపరిశుభ్రంగా పార్కు స్థలం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : కల్లూరు అర్బన్ 35వ వార్డు పార్థసారధి నగర్‌లో రూ.10 కోట్ల విలువైన పార్కు స్థలం పందులకు, పాములకు నిలయంగా మారినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం పిపిఎస్ఎస్ నాయకులు, కాలనీవాసులు శ్రమదానంతో పిచ్చి మొక్కలు, జెసిబితో కంప చెట్లు తొలగించి శుభ్రం చేసుకున్నారు ఈ సందర్భంగా ఇరిగినేని పుల్లారెడ్డి, స్థానిక కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పి సుకుమార్, వి వెంకటేశ్వర్లు, పి ఆంజనేయులు మాట్లాడుతూ కర్నూలు శివారు కాలనీల ప్రజలు నిబంధనల ప్రకారం రూ.కోట్ల విలువైన స్థలాలను నగరపాలక సంస్థకు అప్పజెప్పి ఏళ్లు గడుస్తున్నా కనీసం మొక్కలు కూడా నాటకుండా పార్కుల అభివృద్ధిని గాలికి వదిలేసారన్నారు. కంప చెట్లను జెసిబితో తొలగించి పార్కును చదును చేశారు. కొన్ని పార్కులకు కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారని, అవసరం లేని చోట్ల రోడ్ల పక్కన రోడ్లు వేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారని తెలిపారు. ఇళ్ల పన్నులు పెంచడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు మెరుగుపరచడంపై లేదన్నారు. కర్నూలు నగర పాలక సంస్థ పాలకవర్గం శివారు కాలనీల పార్కులను పట్టించుకోవడం లేదన్నారు. అసమానతలు లేని అభివృద్ధిని చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం వెంటనే స్పందించి శివారు ప్రాంత కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ పార్కు పార్థసారధి నగర్, సురేష్ హోమ్స్, గీతాంజలి, సన్ రైస్ కాలనీల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. శ్రమ దానంలో కే శ్రీనివాసులు, ఏ ధర్మరాజు, ఎన్ పీటర్, వెంకటరెడ్డి, వీరేశ్, శీను, దివాకర్ పాల్గొన్నారు.

-శ్రమదానంతో ముళ్ల కంపను తొలగిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో గౌరుచరిత , మల్లెల రాజశేఖర్, తదితరులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'ఇది మంచి ప్రభుత్వం' సభలో గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: ప్రజాసంక్షేమమే రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి, టిడిపి మండల సీనియర్ నాయకులు సిఎస్ సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి , ఎంపిడిఒ నాగ శివప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమాలపై ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. సభలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యేను ఇతర టిడిపి నాయకులనుకాల్వ గ్రామటిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ వెంకటరమణ, హుసేనాపురం వాటర్‌షెడ్ కమిటి చైర్మన్ చంద్ర, పెద్దస్వామిఎపిఒ సాయినాథ్, ఎస్ఐ సునీల్ కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవి.నారాయణ

ఏచూరి మరణం దేశానికి తీరని లోటు

కోడుమూరు సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి, కమ్యూనిస్టులకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి నారాయణ పేర్కొన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభ కోడుమూరు సంత మార్కెట్ సిపిఎం ఆఫీస్‌లో ఆ పార్టీ మండల కార్యదర్శి గఫూర్‌మియా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవినారాయణ, సిపిఐ జిల్లా నాయకులు కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు, యుటిఎఫ్ జిల్లా నాయకులు సలీం బాషా, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవ స్వామి ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏచూరి పుట్టుక బ్రాహ్మణ కుటుంబంలోనైనా ఆచారాలు వదిలి బడుగు బలహీన వర్గాల కోసం పనిచేశారని తెలిపారు. విద్యార్థి దశ నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారని తెలిపారు. రాజ్యసభలో ఆయన చేసిన ప్రసంగాలను ప్రతిపక్ష పార్టీలు , అనుబంధ పార్టీలు ఎంతో ఆసక్తితో వినేవారని చెప్పారు. దాదాపుగా 12 భాషలు మాట్లాడడంలో ఆయన ప్రావీణ్యుడన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రంగస్వామి, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, సిపిఎం సీనియర్ నాయకులు టి.వీరన్న, ఆవాజ్, ఎంఆర్‌పిఎస్, ఐకెపి యానిమేటర్లు, అంగన్వాడి ఆశవర్కర్స్ యూనియన్ విద్యార్థి, యువజన సంఘాల నాయకలు పాల్గొన్నారు.

30న కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈ నెల 30 తేదీన దేశవ్యాప్తంగా జరుగు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు, రెగ్యులర్ కానీ ఉద్యోగుల సమస్యలపై ప్రచారం నిర్వహించి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస సౌకర్యాలు పని ప్రదేశాల్లో కల్పించాలని తదితర డిమాండ్లపైన దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ధర్నాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, సాయిబాబా, గోపాల్, విజయ్, ప్రభాకర్, ఉమాదేవి, వెంకటమ్మ రేణుకమ్మ, బాల దుర్గమ్మ, సుధాకరప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

ఆటలతోనే మానసిక ఉల్లాసం

- మాజీ ఎంపి టీజీ వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : ఎంచుకున్న క్రీడను ఆడటం వల్ల మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మాజీ ఎంపి టి జి వెంకటేష్ అన్నారు. ఆదివారం తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించి, క్రీడకారులకు బెల్టులు అందజేశారు. టిజివి, టిజిబి తైక్వాండో అకాడమీలో విద్యార్థులతో తైక్వాండో సాధన చేయిస్తున్న మాస్టర్ టి.వెంకటేశ్వర్లును ప్రత్యేకతంగా అభినందించారు. మాస్టర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తైక్వాండో విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బ్లాక్ బెల్ట్ లు సాధించిన చిరు, చరణ్ తేజ్, విశ్వాసరావులను తైక్వాండో మాస్టర్స్ టి అజయ్, టి తేజ, శ్రీలలిత,మల్లేష్, తిలక్, అఖిల్, సాయికృష్ణ, శివమణి అభినందించారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ముజఫర్ నగర్‌లో ఆదివారం టిఎన్ లైబ్రెరీ కమిటీ, సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా సంఘల ఆధ్వర్యంలో కైలాష్ క్లినిక్ సహకారంతో డాక్టర్ అనీశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిపి, షుగర్, కంటి చూపు, థైరాయిడ్, బోన్ టెస్టింగ్ సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి ఎస్ రాధాకృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ అనీశ్వర్ రెడ్డి, క్యాంపు నిర్వాహకులు కె ప్రభాకర్, సిఐటియు నాయకులు సాయిబాబా, డివైఎఫ్ఐ నాయకులు హుస్సేన్ బాషా మాట్లాడుతూ ముజఫర్ నగర్ ఏరియా చాలా స్లమ్ ఏరియా అని, ఇక్కడ పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని తెలిపారు. చాలామంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నప్పుడు ప్రస్తుత పరిస్థితులలో ప్రైవేట్ హాస్పిటల్‌లలో డబ్బులు పెట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కనుక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపుకు ప్రజలనుండి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సుధాకరప్ప, సురేష్, గ్రంథాలయం గౌరవ అధ్యక్షుడు బడేసాహెబ్, కోశాధికారి తారక్ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫి కృషి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి నిత్యం లియాఫీ కృషి చేస్తుందని లియాసి ఆల్ ఇండియా వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ ఎం నారాయణరెడ్డి, లియాఫి జోనల్ ప్రెసిడెంట్ జంపాల కృష్ణారెడ్డి, లియాఫీ కడప డివిజన్ ప్రెసిడెంట్ జయభారత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో ఎమ్మిగనూరు బ్రాంచ్ లియాఫీ మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం లియాఫీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, యాజమాన్యంతో పోరాటంగా సానుకూలంగా లియాఫీ పోతుందన్నారు. ఎల్ఐసి స్థిరంగా ఉండడానికి ఏజెంట్ల వ్యవస్థ ఎంతో తోడ్పడుతుందని ఎల్ఐసి యాజమాన్యం ఎన్నోసార్లు పేర్కొందన్నారు. ప్రస్తుతం ఎల్ఐసి మార్కెట్లో 63శాతం పైగానే ఉందని, 22 శాతం ఎల్ఐసి గ్రోథింగ్తో ఉండగా, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఐదు శాతం గ్రోతింగ్ కూడా లేవని అన్నారు. 1991 వ సంవత్సరంలో ఎల్ఐసి ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ పదివేలు ఉండగా నేడు 15 లక్షలు ఉందని, అలాగే మెడికల్ క్లెయిమ్ పదివేలు ఉండేదని ప్రస్తుతం ఐదు లక్షలకు పోరాటం ద్వారానే తీసుకొచ్చామని, ఏజెంట్లకు 65 సంవత్సరాల తర్వాత గ్రాడ్యుటి రూ.ఐదు లక్షలు వారి వ్యాపారం ప్రకారం ఇచ్చేలా సాధించగలిగిందన్నారు. ఎల్ఐసి కంపెనీ అభివృద్ధి పథంలో నడవాలంటే ఏజెంట్ నాణ్యమైన బిజినెస్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. బ్రాంచి లియాఫీ అధ్యక్ష, కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి పోస్టులకు పోటీ నెలకొనడంతో ఎన్నిక జరిగింది. ఎన్నికలను జోనల్ డివిజన్ నాయకులు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ డివిజన్ నాయకులు టి కృష్ణ, నీలప్ప గజేంద్ర రెడ్డి సిద్ధ లింగ రంగస్వామి రమేష్ ఆంధ్రయ పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న లియాఫి ఎమ్మిగనూరు బ్రాంచి నూతన నాయకత్వం

నూతన కమిటీ ఎంపిక:

లియాఫీ ఎమ్మిగనూరు బ్రాంచ్ అధ్యక్షులుగా పి.ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా బి.జయన్న, ఆర్థిక కార్యదర్శిగా బి.వీరేష్ అత్యధిక ఓట్లతో గెలిచారు. ఉపాధ్యక్షులుగా మధుసూదన్ రెడ్డి, సుధాకర్, ప్రభాకర్, మహిళా ప్రతినిధులుగా ఇందిరావతమ్మ, సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెట్లు నరికివేతపై వివాదం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో చెట్లు నరికివేయడంపై ఆదివారం వివాదం చెలరేగింది. శనివారం రాత్రి ఎవరికి తెలియకుండా కురువ లింగప్ప, కురువ రామచంద్ర, కురువ మల్లప్ప, కురువ కుడుము భీమయ్య, కురువ గడ్డం భీమయ్య, కురువ బంగారు భీమయ్యలు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద చెట్లను నరికి వేశారని శ్రీ కరి వీరభద్రేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కె.రాఘవరెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ 1935లో రోడ్డుకు ఇరువైపులా వేప చెట్లు, బసిరి చెట్లు నాటారన్నారు. అప్పటి నుండి భారీ వృక్షాలుగా పెరిగి ఎంతో ఆకర్షణీయంగా కనిపించేదన్నారు. చెట్ల నరికివేతపై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం చెట్లు నరికిన భూమి వివాదంలో ఉందని, వారి పూర్వీకులు తమ తండ్రి శివారెడ్డికి సర్వే నెంబరు 71-జెలో ఉందని, దాన్ని వారి ఆస్తిగా చెప్పుకుంటున్నారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కురువ లింగప్ప, కురువ మల్లప్ప, కురువ కుడుము భీమయ్య, కురువ రామచంద్ర, కురువ గడ్డం భీమయ్య, కురువ బంగారు భీమయ్యలు మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల చెట్లు ఇటీవల తమ ఇండ్లపై పడిందని, పెను ప్రమాదం తప్పిందని చెప్పారు. తమ సొంత స్థలంలో పెంచుకున్న చెట్లను ప్రమాదాల నుంచి తప్పించుకునేందుకు ముందు జాగ్రత్తగా అటవీశాఖ అధికారుల అనుమతితో నరికివేశామన్నారు. అదే స్థలాల్లో కొత్త మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని, సొంత స్థలంలో ఉన్న చెట్లను నరికితే వారికి వచ్చిన ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

కల్లుదేవకుంటలో నరికి వేసిన 1935 నాటి చెట్లు

మంచి ప్రభుత్వానికి పట్టం కట్టిన ప్రజలు : ఎంపీ

పజాశక్తి - ఆలూరు

రాక్షస పాలనలో నరకయాతన అనుభవించిన రాష్ట్ర ప్రజలు మంచి ప్రభుత్వానికి పట్టం కట్టారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద హెూతూరు గ్రామంలో మండల కన్వీనర్ అశోక్ అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి బస్తీపాటి.నాగరాజు, టిడిపి నాయకులు వీరభద్రగౌడ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డి ప్రకాష్ నాయుడు, ఎంపిటిసిలు చిన్న, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: ఆలూరులో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

వంద రోజుల్లో అనేక పనులు చేశాం: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ఎమ్మిగనూరు మండలం దైవందిన్నెలో పర్యటించిన ఎమ్మెల్యే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో 40 వేల లీటర్ల ఘనపరిమాణం గల తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటి కొలాయి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పౌరుడు గౌరవంగా జీవించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తుందని తెలిపారు. గత వైసిపి హయాంలో ఎమ్మిగనూరు నియోజకవర్గం అభివృద్ధి ఏమి జరగలేదని, కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మిగనూరు మండల టిడిపి అధ్యక్షుడు మల్లికార్జున, అయ్యాలప్ప, కురువ సంఘం నాయకుడు మద్దిలేటి, మల్లయ్య, జగదీశు ,తిమ్మాపురం వేంకటేశు,నర్సింహులు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్రెడ్డి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కౌతాళం, కామవరం, కరణి, కాత్రికి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడిన 100 రోజులకు మంచి ప్రభుత్వమని ప్రజలు మెచ్చేలా పాలన సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి రాజు, తెలుగు యువత సతీష్ నాయుడు, మాజీ ఎంపిటీసీ సౌద్రి బసవరాజు, నరసింహ మూర్తి స్వామి, నీలకంఠ రెడ్డి, డాక్టర్ రాజనంద, కురువ వీరష్, గిరి, ముకన్న, నరసప్ప, రమేష్, జనసేన రామంజినేయులు, గోట్టయ్య, లింగేశ్, నబీ, చిరంజీవి, అమ్మువలి, కాత్రికి చంద్ర, బంగారయ్య, ఈరన్న, అయ్యప్ప, దేవప్ప, కమవరం తిక్కయ్య, జాకీర్, గురురాజ్ స్వామి, మద్రీస్వామి, రామలింగ, నబి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంలో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్ విడుదల

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-ఆదోని

ప్రోటోకాల్ పాటించకుండా తమను అవమానం చేశారని టిడిపి నాయకులు తిమ్మప్ప, లక్ష్మినారాయణ, వెంకటేష్ వాల్మికి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలో మున్సిపల్ మైదానంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ అనుపమ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమంలో అనధికార వ్యక్తులను స్టేజి మీదకు ఎందుకు ఆహ్వానిస్తున్నారని నిలదీశారు.కౌన్సిలర్, ఇంఛార్జిలను మాత్రమే పిలవాలని అందరిని పిలిచి ప్రోటోకాల్ తప్పవద్దన్నారు.

మున్సిపల్ కమిషనర్ తో వాగ్వివాదం దిగిన నాయకులు

పెండింగు ప్రాజెక్టులకు నిధులివ్వండి

మంత్రి నిమ్మల రామానాయుడుని వినతి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

పెండింగు ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బిజి.జయనాగేశ్వరరెడ్డి కర్నూలులోని ఎపిస్టేట్ గెస్ట్హౌస్లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని సాగునీటి తాగునీటి వనరులైన జిడిపి, ఆర్డిఎస్ పనులును గురించి చర్చించి ప్రాజెక్టుల పూర్తి కోసం త్వరితగతిన బడ్జెట్ కేటాయించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. వీటి ద్వారా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పాటు పశ్చిమ ప్రాంతంలోని అన్ని తాలూకాలోని అనేక గ్రామాలకు సాగు,తాగునీరు అందుతుందన్నారు. వెంటనే నిధులు కేటాయించాలని విన్నవించారు. తదనంతరం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ స్వగృహంలో వద్ద టి.జి. భరత్ , కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు , జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ పి.రంజిత్ పాషా , మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేశ్ , కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షుడు పి తిక్కారెడ్డి , పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ బాబు ,కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి , మంత్రాలయం ఇంచార్జి వాల్మీకి రాఘవేంద్ర రెడ్డి , ఆలూరు ఇంచార్జి వీరభద్ర గౌడ్ , ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్రెడ్డి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాఘవేంద్ర రెడ్డి

ఎత్తిపోతలకు నిధులు ఇవ్వండి

- మంత్రులకు విన్నవించిన రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం: నియోజకవర్గంలో అధ్వానంగా మారిన శ్రీ గురురాఘ వేంద్ర, ఐడీసీ సాగు నీటి ఎత్తిపోతల అభివృద్ధి కోసం నిధులు అవసరమవుతాయని, అందుకు కావాల్సిన నిధులను ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర మంత్రులు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ టీజీ భరత్లకు టిడిపి ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదివారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని హంద్రీ నీవా ప్రాజెక్ట్, మల్యాల ఎత్తిపోతల పథకం పరిశీలన నిమిత్తం వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుని రాఘవేంద్ర రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి నియోజవర్గంలోని (1) గురు రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మాధవరం స్టేజ్-1, బసలదొడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ స్టేజి 1, స్టేజి 2, దుద్ది లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మొత్తం నాలుగు కోట్ల ఇరవై ఏడు లక్షలు వీలైనంత త్వరగా కేటాయించాలని మంత్రికి విన్నవించారు.

బ్రిడ్జి పునఃనిర్మాణానికి కృషి : బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట గ్రామంలో జాతీయ రహదారిపై బ్రిడ్జి పున:నిర్మాణానికి కృషి చేస్తానని టిడిపి నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హామీనిచ్చారు. ఆదివారం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తన సొంత పని నిమిత్తం పక్కనే ఉన్న కొక్కరచేడు గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని చింతకుంటకు పిలుచుకొచ్చి దెబ్బతిన్న బ్రిడ్జిని చూపించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు, స్థానిక నాయకులు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన వంతు బాధ్యతగా నంద్యాల ఎంపీ శబరి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి త్వరితగతన సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : టిడిపి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

నియోజకవర్గంలో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చేపడతామని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కమ్మలదిన్నె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులలో చేసిన పనులను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, జనసేన మంత్రాలయం ఇంచార్జీ లక్ష్మన్న, మండల నాయకులు గణేష్, టిడిపి మండల కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న, నాయకులు ఏసేపు, విజయ్ కుమార్, నాగేంద్ర, శంకర్, భీమేష్, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి ఇన్ఛార్జి రాఘవేంద్ర రెడ్డి

పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం

- వెటర్నరీ డాక్టర్ మహేష్

ప్రజాశక్తి - చిప్పగిరి : పశు సంపద ఉన్న రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని అమలులోకి తెచ్చిందని వెటర్నరీ డాక్టర్ మహేష్ తెలిపారు. ఆదివారం నేమకల్లులోని వెటర్నరీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పశువులకు మేత కొనుగోలు కోసం అప్పు చేసి ఈ మేరకు తక్కువ వడ్డీకి అధిక మొత్తంలో రుణాలు పొందేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు. గడ్డి విత్తనాలు, దాన, వైద్యం తదితర అవసరాలకు ఈ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవచ్చన్నారు. పశు సంపద ఉన్న రైతులందరూకూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోనెగండ్లలో దశమి ఉత్సవాలు ప్రారంభం

- బందోబస్తు ఏర్పాటు : డిఎస్పి ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో చింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు ఆదివారం రాత్రి గుర్రపు పల్లకి సేవతో ప్రారంభమయ్యాయి. సోమవారం దశమి, మంగళవారం ఆరాధనతో ముగియనున్నాయి. ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్ర బాబు గోనెగండ్లకు విచ్చేసి ఉత్సవాలను నిర్వహించే ఆలయ పరిసరాలు, పోలీసులు చేపట్టే బందోబస్తు చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనను శాలువా పూలమాలతో స్వాగతించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ ఈ ఉత్సవాలలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా 4 సిఐలు, 70 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గోనెగండ్ల సిఐ గంగాధర్, పోలీసు సిబ్బంది, ఆలయ పూజారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు హాజరయిన డిఎస్పి ఉపేంద్రబాబు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఈ నెల 9న శివరామిరెడ్డి అకస్మాత్తుగా మృతి చెందడంతో తోటి మిత్రులు కుటుంబానికి అండగా నిలిచారు. స్నేహితులు అందరూ కలిసి ఆదివారం శివరామిరెడ్డి కుటుంబ సభ్యులకు రూ. 72 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాజా, నాగరాజు, చిరంజీవి, అయ్యస్వామి, రహంతుల్లా, మాధవస్వామి, వెంకటేష్, శేషు, చంద్రశేఖర్, శివకుమార్, రమణ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయంఅందజేస్తున్న స్నేహితులు

మున్సిపల్లో పదోన్నతులు కల్పించాలి : ఎస్టియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మున్సిపల్ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టికె.జనార్ధన్ కోరారు. ఆదివారం కర్నూలు సలాం ఖాన్ ఎస్ టి యు భవనంలో డి.సుధీర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 12వ పిఆర్సి ఆలస్యమవుతున్నందున వెంటనే 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. పిఆర్సి, డి.ఎ. బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీనియర్ నాయకులు దేవదాసు ,సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిక్కన్న సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -ఆదోని : సిపిఐఎంఎల్ నాయకులు తిక్కన్న పోరాట పటిమ గల నాయకుడని ఆయన సేవలు మరువలేనని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. తిక్కన్న వర్ధంతి సభకు ముఖ్యవక్తలుగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.గనిరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు మాట్లాడుతూ తిక్కన్న జీవితం విప్లవోద్యమానికే అంకితమయ్యాడని ,తన చివరి శ్వాస వరకు విప్లవ పార్టీలో కొనసాగాడని అన్నారు. తన చిన్నతనం నుండే ఏటీర్ ఆయిల్ మిల్లులో తన కార్మిక పోరాటం మొదలు పెట్టాడని ,ఆదోనిలో అశేష కార్మిక వర్గాన్ని కూడగట్టుకొని కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. తిక్కన్న 2022 సెప్టెంబర్ 22న అర్ధరాత్రి అనారోగ్యంతో ఆదోనిలో మరణించారని తెలిపారు. ఆయన మరణం కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విప్లవ పోరాటాలకు తీవ్రమైన నష్టం అని అన్నారు. కే .తిక్కన్న ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేశారని తెలిపారు. సిపిఎస్యుఐ జాతీయ కార్యదర్శి కోదండ, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ, అయితే ఎం ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న మాట్లాడారు. పేదల పక్షాన పోరాడటమే తిక్కన్న కు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అని తెలిపారు. పారిశ్రామికవేత్త ఏసి. శ్రీకాంత్ రెడ్డి ,బిసి.ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడారు. ఆయా ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి పిహెచ్డి ప్రదానం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

కర్నూలు కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ విభాగం అధ్యక్షులుగా పనిచేస్తున్న కె వెంకటరెడ్డికి పరిశోధనలో భాగంగా డాక్టరేట్ పట్టా లభించింది. రాంచీలోని వైబిఎస్ విశ్వవిద్యాలయం వారు 'ఇంపాక్ట్ అఫ్ మైక్రోఫైనాన్స్ ఆన్ ఉమెన్ ఎంపవర్మెంట్ ఇన్ ఇండియా' అనే అంశం మీద చిత్తూరు జిల్లాను కేంద్రంగా చేసిన ఆయన పరిశోధనాంశం మీద 2024 సెప్టెంబర్ 13న వైవా నిర్వహించి డాక్టరేటు ప్రదానం చేశారు. డాక్టర్ కె.వెంకట్ రెడ్డి అధ్యాపకులుగా 30ఏళ్ల అనుభవం కలిగి ఉన్నారు. వివిధ కళాశాలలో వారు వాణిజ్య విభాగంలో అధ్యాపకులుగా మంచి పేరు సంపాదించుకున్నారు. అలాంటి డాక్టర్ వెంకట రెడ్డికి డాక్టర్ దేవేంద్ర కుమార్ ఓజా ఆచార్యులు వైవిఎన్ యూనివర్సిటీ వారు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ , రిజిస్టర్ ఆచార్యకట్ట వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటరెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రధానాచార్యులు డాక్టర్ వైవిఎస్ కుమార్ అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి దేవికరాణి , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తాం

ప్రజాశక్తి- సి బెళగల్

సంక్షేమ పథకాలు అందించేందుకు టిడిపి ప్రభుత్వం అన్ని విధాలుగా సర్వం సన్నాహాలు చేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం మండల అధికారులు మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ సమక్షంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మండల ప్రత్యేక అధికారి శ్యామల, ఎంపిడిఒ రాముడు, తహసీల్దార్ విజయ శ్రీ, ఇఒఆర్డి సందీప్, ఎపిఎం వెంకటస్వామి, హౌసింగ్ ఏఈ సుమంత్, విద్యుత్ ఎఇ సుకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముందుగా అంబేద్కర్, రాఘవ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఊరేగింపుగా పాత బస్టాండ్ సర్కిల్కు చేరుకుని సభలో మాట్లాడారు. ఈ వంద రోజుల పాలనలో ఈ ప్రభుత్వం ప్రజలకు అన్నీ విధాలుగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు సమస్యలు పరిష్కరించుటలో అధికారులు అలసత్వం చూపరాదని, నాయకులు, కార్యకర్తలు సమస్యలపై, అభివృద్ధిపై అధికారులతో చర్చలు జరిపి సంక్షేమానికి బాటలు వేయాలని కోరారు. స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో దారుణ హత్య

ప్రజాశక్తి- గూడూరు

గూడూరు గ్రామానికి చెందిన బోయ రవి(20) గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. పోలీసుల వివరాల ప్రకారం...బోయ చిన్న మద్దిలేటి, మద్దమ్మకు ఇద్దరు కుమార్తెలు ,ఇద్దరు కుమారులు ఉన్నారు. రవి ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గడ్డి వాములో పశువులకు దాన వేయడానికి వెళ్ళగా గుర్తుతెలియని వ్యక్తులు గొంతుకు తాడు బిగించి ముఖం మీద కొట్టి చాతిమీద పొడిచి చిత్ర హింసలతో హత్య చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య సంఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్తో పరిశీలించగా కొన్ని వస్తువులు స్వీకరించి అన్ని కోణాల్లో పరిశీలించారు. మతునికి వివాహేతర సంబంధాలు ఉన్నాయని, చుట్టుపక్కల ప్రజలు తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

దేవనకొండ సిఐగా వంశీనాథ్ బాధ్యతలు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా శ్రీనాథ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఏసీబీ సీఐగా పని చేస్తున్న ఈయన బదిలీపై దేవనకొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా కలిసిమెలిసి జీవించాలన్నారు. అక్రమ మద్యం, మట్కా, జూదం వంటి ఆసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

దావాసమను

Order 5 Rule 1 & 5

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కర్నూలు, (ఆ. ప్ర.)

ఓ.ఎస్.నెం.166/2021

కే.మధుసుదన రెడ్డి తండ్రి కె.వెంకట రమణరెడ్డి వయసు 45 సం. హిందు, వ్యవసాయము తక్కశీల గ్రామం, ఉండవెల్లి మండలం, జోగులాంబ గద్వాల్ జిల్లా, ప్రస్తుతం కోలాన్ నారాయణరెడ్డి నగర్, నిజాంపేట్, హైదరాబాద్. ...వాది

-Versus -

బి.సురేష్ తండ్రి బి.నరసన్న వయసు 45 సం. హిందు, వ్యాపారం, ఇంటి నెం.17/169-ఎ, ఎర్రమెట్ట, కర్నూల్ ...ప్రతివాది

ప్రతివాదికి దావాసమను

పై కేసులోని వాది దగ్గర ప్రతివాది అయిన నీవు 13.02.2018వ తేదిన రూ.2,30,000/- అప్పుగా తీసుకొని అదే రోజున రూ.1,30,000/- రూపాయలకి ఒక ప్రామిసరి నోటు మరియు రూ.1,00,000/- రూపాయలకి మరిఒక ప్రామిసరి నోటు నూటికి రూ.2/- నెలకి వడ్డి ప్రకారము ఒప్పుకొని 13.02.2018 వ తేదీన వాదిపేరు మీద రెండు ప్రమిసరి నోట్లు వ్రాసి యిచ్చియున్నారు. బాకీ మొత్తము రూ.3,95,000/- రూపాయలు రాబట్టుకొనుటకై వాది మీపై దావా వేసియున్నారు. కావున మీకు ఎలాంటి అక్షేపనలు ఉన్నయెడల పైకోర్టులో 14.10.2024వ తేదిన ఉదయం 10.30 నిమాషాలకి హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order Of the Court

వాయిదా : 14.10.2024

వాదిపరం అడ్వకేట్

D. Yella Reddy,
Advocate For Plaintiff, Kurnool.